సేవామూర్తి


వెంకయ్యనాయుడి నుంచి అవార్డు అందుకుంటున్న తస్లీమా (ఫైల్)

అభాగ్యులను అక్కున చేర్చుకుని విశాలమైన హృదయంతో ఆశ్రయం కల్పిస్తున్న సేవామూర్తి అభయక్షేత్రం వ్యవస్థాపకురాలు తస్లీమా. రేణిగుంటలో 2007లో ఇద్దరు మానసిక వికలాంగులను అక్కున చేర్చుకుని తన ప్రస్తానాన్ని ప్రారంభించారు. అది నేడు అభయక్షేత్రంగా విరాజిల్లుతోంది. తల్లి తండ్రులకు భారమై వీధులపాలు చేస్తున్న ఎంతోమంది శారీరక, మానసిక వికలాంగులు, వయోవృద్ధులు, వ్యాధిగ్రస్తులకు ఆశ్రయం కల్పించి, నిత్యం సేవలు చేస్తూ వారి భారని తనపై వేసుకుని, వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. అభయ క్షేత్రంలో ప్రస్తుతం 200 మంది అనాథ పిల్లలు, వయో వృద్ధులు, మానసిక, శారీరక వికలాంగులు ఆశ్రయం పొందుతున్నారు. గతంలో అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం తస్లీమాకు ఎన్జీఓ అవార్డు(నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్) ఇచ్చారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇన్‌స్పైరింగ్ ఉమెన్ అవార్డును 2016లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అందజేశారు.



హరిత సాధకురాలు



మూడేళ్ల ముందు ఆ పాఠశాలకు ప్రహరీ లేదు.. ఆవరణలో నిలువ నీడ లేదు.. అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతుండేది. ఉద్యోగోన్నతుల్లో భాగంగా ఆ స్కూలు వచ్చిన హెచ్ఎం ఆ పరిస్థిత చూసి చలించిపోయింది. ఆ విద్యాలయాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలని నిర్ణయించుకుంది. అందుకు విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పించింది. పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకానికి చర్యలు తీసుకుంది. ఆ మొక్కలు ఏపుగా పెరిగి వృక్షాలుగా అవతరించాయి. ఫలితంగా నేడు ఎటు చూసినా పచ్చదనం పరుచుకుంది. అంతటితో ఆగలేదు ఆమె. స్కూలులో వర్షపు నీటి పరిరక్షణకు ఇంకుడు గుంతలు ఏర్పాటుకు కృషి చేసింది. వృథా నీటి సంరక్షణకు వేస్టు వాటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ నిర్మాణానికి పాటుపడింది. అంతేకాకుండా పాఠశాలతోపాటు పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేసింది. వెరసి ఆ విద్యాలయం హరిత పాఠశాలగా గుర్తింపు సాధించి, అవార్డు అందుకోవడానికి కృషి చేసింది . ఆమె నారాయణవనం బాలికల పాఠశాల హెచ్ఎం శశికళ. 488 మంది బాలికలు, 20 మంది మహిళా ఉపాధ్యాయుల పర్యవేక్షణను ఆమె సవాలుగా తీసుకుని సేవాభావంతో పనిచేస్తోంది. ఇందుకు నిదర్శనం మూడు సార్లు జాతీయ స్థాయిలో గ్రీన్ స్కూల్ అవార్డుకు పాఠశాల ఎంపిక కావడమే. పోటీ ప్రపంచంలో మరో అడుగు ముందుకు వేసి పాఠశాలలో నెలకొల్పిన అటల్ థింక్ సెంటర్ ద్వారా 25 మంది బాలికలు జట్టుగా ఇస్రో 2023లో రాకెట్‌తో పంపిన ఉపగ్రహం ప్రోగ్రామింగ్‌కు డీకోడ్ చేసిన పాఠశాలగా రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చుకోవడంలోనూ ఆమె పాత్ర కీలకం.

– నారాయణవనం

క్లుప్తంగా

శాస్త్రవేత్తలుగా ఎదగాలి


సైన్స్ స్టాల్ ప్రారంభిస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం వారు బుచ్చినాయుకండ్రిగలో విద్యార్థులు ఏర్పాటు చేసిన 130 సైన్స్ ఎగ్జిబిషన్స్ ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన హై సెన్సిటీవ్ ఎల్‌పీజీ గ్యాస్ డిటెన్షన్ అండ్ అలెర్ట్ సిస్టమ్, డ్రై హ్యాండ్ వాషింగ్ మిషన్, సోలార్ ఫ్లోర్ క్లీనర్ రోబోలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య, కరస్పాండెంట్ సుధాకర్, డైరెక్టర్ యోగేశ్వర్, రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, సభ్యులు శ్రీనివాసరావు, హరిబాబు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ సేవలు ఎనలేనివి


ఏఎస్ఐ శివకుమార్‌ను సన్మానిస్తున్న సీఐ, ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా శివకుమార్ చేసిన సేవలు ఎనలేనివని బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య కొనియాడారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్ఐ శివకుమార్‌కు ఎస్ఐ విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎస్ఐ శివకుమార్ 40 ఏళ్ల చిత్తశుద్ధి, నిజాయితీగా విధులు నిర్వహించారని, పోలీసు వ్యవస్థలో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి రూరల్ ఎస్ఐ నరసింహ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

సత్యవేడు: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై శుక్రవారం హీరో కంపెనీ సిబ్బంది ఎం.రాజీవ్ వర్మ, ఏ.బ్రహ్మానాయుడు, టి. సాయితేజ తదితరులు అవగాహన కల్పించారు. ఇళ్లలో అగ్ని ప్రమా దం సంభవిస్తే అప్రమత్తంగా ఎలా బైటపడాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రదర్శనపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కే.భారతి, మనోహర్, వైవీఎస్ కుమార్, పాండురంగయ్య, మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు కోసం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవి తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. దాసుకుప్పం, పేరడం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

మహిళా వంచకుడు బాబు

నారాయణవనం: మహిళలను ఉచిత హామీలతో మాయ చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన అధికారం ముగిసే వరకు ఏ ఒక్క హామీని అమలు చేయలేదని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా క్రియాశీల కార్యదర్శి రాకేష్ కిరణ్ ఎద్దేవా చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి రావడం కోసం 2024 ఎన్నికల్లో మహిళలను మభ్యపెట్టడానికి ఉచిత బస్సు, ఎందరు పిల్లలున్నా అందరికీ రూ.15 వేలు తల్లికి వందనం, మహిళలకు ప్రతినెలా రూ.1500తోపాటు సూపర్ సిక్స్ అమలు చేస్తామని హామీలతో ఊదరగొట్టిన చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చాక ఆదాయం లేదు.. హామీలు లేవంటూ మోసం చేస్తున్నాడని రాకేష్ అన్నారు. శనివారం ప్రపంచమంతా మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటుంటే రాష్ట మహిళలు మాత్రం చంద్రబాబు వంచనకు గురవుతున్నారని అన్నారు. మహిళలే ఆదిపరాశక్తులై చంద్రబాబుకు రాబోవు ఎన్నికల్లో గట్టి గుణపాఠాన్ని నేర్పుతారని రాకేష్ కిరణ్ అన్నారు.

సాదర స్వాగతం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): చిత్తూరులో జరిగే మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి విమానాశ్రయంలో బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.

శ్రీసిటీలో నారీ శక్తి



తయారీ రంగ పరిశ్రమల్లో కార్మికులు, ఉద్యోగులంటే గతంలో మగవారికే పరిమితం. అక్కడక్కడ సున్నితమైన పని ప్రదేశాల్లో మాత్రమే మహిళలు కనిపించేవారు. ఇప్పుడా హద్దుల్లేవు. లింగభేదం లేకుండా ఎలాంటి క్లిష్టమైన పనులైనా తామూ చేయగలమంటున్నారు అతివలు. అందులో భాగంగానే శ్రీసిటీలో మహిళలు తమ సత్తా చాటుతున్నారు. పరిశ్రమల్లోనూ తమదైన శైలితో పురుషులకు దీటుగా పనిచేస్తూ రాణిస్తున్నారు. అన్నిటా తాము సగమని నిరూపిస్తున్నారు. ఆకాశమే హద్దుగా పరిశ్రమల్లో క్లిష్టమైన పనులను సైతం అవలీలగా చేస్తున్నారు.

జెన్ లెనిన్ పరిశ్రమలో ఉద్యోగినులు



బ్లూస్టార్ పరిశ్రమలో ఉద్యోగినులు



శ్రీసిటీ (వరదయ్యపాళెం): పారిశ్రామిక రంగంలో నారీశక్తికి శ్రీసిటీని ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. ఇక్కడ అనువైన వాతావరణం, భద్రత, యాజమాన్యాల ప్రోత్సాహం.. మహిళలను కార్మిక లోకంలో అడుగుపెట్టేందుకు విశేషంగా ఆకర్షిస్తోంది. విద్య, నైపుణ్యం అంతగా లేకున్నా శ్రీసిటీ పరిసరాల నుంచి వేలాది మంది ఇక్కడ పరిశ్రమల్లో చేరి, శిక్షణ, అనుభవంతో రాణిస్తున్నారు.అలాగే స్థానికులే కాకుండా పలు జిల్లాలు, రాష్ట్రాల సరిహద్దులు దాటి కూడా డిప్లొమా, ఇంజినీరింగ్ పూర్తిచేసిన యువతులు ఇక్కడ ఉద్యోగాలలో స్థిరపడి తమ సత్తా చాటుతున్నారు. శ్రీసిటీలోని దాదాపు 235 పరిశ్రమలలో సుమారు 65 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వీరిలో 52 శాతం మహిళలు కావడం గమనార్హం! దేశంలో మరెక్కడా ఈ స్థాయిలో మహిళా కార్మికులు లేదనే చెప్పాలి. శ్రీసిటీలోని మెజారిటీ పరిశ్రమలలో సంఖ్యాపరంగా మహిళలదే పైచేయి. టూత్ బ్రష్‌ల నుంచి మెట్రో రైళ్ల వరకు, మొబైల్ ఫోన్ల మొదలుకుని ఏసీల తయారీ వరకు, టీ, కాఫీ, దుస్తులు, ఆహార పానీయాలు..ఇలా పలు రంగాల పరిశ్రమలలో వీరు ప్రతిభ చాటుతున్నారు.

లైన్ లీడర్‌గా..



విజయవాడలో ఇంజినీరింగ్ చదివి క్యాంపస్ సెలక్షన్ ద్వారా శ్రీసిటీ డైకిన్‌లో చేరాను. ఉద్యోగంలో రాణించి లైన్ లీడర్‌గా ఎదిగాను. మా నాన్న హోంగార్డ్. నాన్నకు తోడుగా కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నా.

–గ్రీష్మ, విజయవాడ

అమ్మ ప్రోత్సాహంతో..



మా స్వస్థలం లక్నో. నాకు నాన్న లేరు. అమ్మ కష్టపడి పెంచింది. ఇంజినీరింగ్ పూర్తి నిమ్రా నా డైకిన్‌లో ట్రైనీగా చేరాను.ఆపై అంచెలంచెలుగా ఎదిగి 2023లో శ్రీసిటీ హావెల్స్‌లో అసిస్టెంట్ మేనేజర్ (ప్రొడక్షన్)గా వచ్చాను. డిప్యూటీ మేనేజర్ అ య్యాను. ఇక్కడ ఉద్యోగినులు సౌత్, నార్త్ అనే ఫీలింగ్ లేకుండా పని చేస్తున్నాం. –అనామిక సింగ్, హెచ్ఆర్ డీఎం (ప్రొడక్షన్), హావెల్స్, శ్రీసిటీ

సేఫ్టీ అధికారిగా ..



నేను బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ చేసి శ్రీసిటీలోని డైకిన్ ఏసీ పరిశ్రమలో సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నా. ఉద్యోగంలో చేరే కొత్త వారికి సేఫ్టీ అవగాహన కల్పించి ఫైర్ ఫైటింగ్‌లో శిక్షణ ఇస్తాను. జీతటీగా ఉద్యోగంలో చేరిన నేను డైకిన్‌లో వివిధ విభాగాల్లో అంతర్గత శిక్షణ పొందాను. ప్రస్తుతం నేను శిక్షణ ఇవ్వడం గర్వంగా వుంది. మహిళలు ఉద్యోగాల్లో రాణించాలంటే వారు పనిచేసే చోట, వెలుపల భద్రత అత్యంత ముఖ్యం.

–టి.మహేశ్వరి, చిత్తూరు

ఉద్యోగంలో ఎంతో నేర్చుకున్నా..



మాది వైజాగ్. నాన్న స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తారు. మాది మధ్యతరగతి కుటుంబం. ఇంజినీరింగ్ పూర్తి చేసిన వెంటనే కుటుంబ పోషణకు తోడుగా శ్రీసిటీ డైకిలో చేరాను. మొదట్లో ప్రొడక్షన్ సూపర్‌వైజర్‌గా చేరాను. నా ఆసక్తి, ప్రతిభను గుర్తించి మా యాజమాన్యం హెచ్ఆర్‌గా ప్రమోషన్ ఇచ్చింది.కంపెనీ ద్వారా పలు బిజినెస్ ట్రిప్స్ ఢిల్లీ, ఇతర ప్రాంతాల సమావేశాలలో పాల్గొనే అవకాశం వచ్చింది.

–జయప్రద, ఎగ్జిక్యూటివ్–హెచ్ఆర్, డైకి అల్యూమినియం, శ్రీసిటీ

మహిళలకు విస్తృత అవకాశాలు



మాది సూళ్లూరుపేట. ఎం.ఫార్మసీ పూర్తి చేసి ఆరేళ్లుగా శ్రీసిటీలోని ఎక్సలెంట్ ఫార్మా పరిశ్రమలో క్వాలిటీ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాను. గతంలో మహిళలు ఉద్యోగమంటే ఆలోచించేవారు. శ్రీసిటీ వచ్చిన తరువాత పరిస్థితి మారింది. సూళ్లూరుపేటలో మహిళలెవరూ ఖాళీగా లేరు. శ్రీసిటీ, ఇతర చుట్టుపక్కల పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. పోలీస్, సెక్యూరిటీ సిబ్బంది పహారాతో స్త్రీలు నిర్భయంగా ఉద్యోగం చేసుకోవచ్చు.

–వైష్ణవి, సూళ్లూరుపేట

ఉద్యోగ రీత్యా జపాన్ వెళుతున్నా..



మాది విజయవాడ. నాన్న కూలి. కుటుంబంలో మొదట డిగ్రీ చదివిన నేను నాలుగేళ్లుగా శ్రీసిటీ డైకిలో క్వాలిటీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నా. బాగా పనిచేసే వారిని గుర్తించి మా కంపెనీ వారి గ్రూప్ కంపెనీలు వున్న జపాన్, మలేసియా, థాయ్‌లాండ్‌కు ఇక్కడి ఉద్యోగులను పంపి ప్రత్యేక శిక్షణతో ప్రోత్సహిస్తారు. త్వరలో నేను జపాన్ వెళ్లనున్నాను. సొంతంగా ఇల్లు కట్టుకున్నాం.

–మాధవి, క్వాలిటీ కంట్రోలర్, డైకి అల్యూమినియం, శ్రీసిటీ

గంగ నీటి కోసం రైతుల నిరసన


డీఈ పెంచలయ్యకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: తమ పంటలకు తెలుగు గంగ నీటిని విడుదల చేయాలని బుచ్చినాయుడుకండ్రిగలోని డీఈ కార్యాలయం వద్ద రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. మండలంలోని తలారివెట్టు, కల్లివెట్టు, నెలవాయి, వేణుగోపాలపురం, కారణి గ్రామాలకు చెందిన రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కోకోకోలా ఫ్యాక్టరీకి తెలుగుగంగ మెయిన్ కాలువ నుంచి పైపులైన్ వేసి నీటిని అందించటం కోసం గంగ నీటిని ఆపేశారని తెలిపారు. గంగ నీటిని నమ్ముకుని సుమారు 2 వేల ఎకరాల మెట్ట భూముల్లో పంటలను సాగు చేస్తున్నామన్నారు. నీరు విడుదల చేయక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి సాగు చేసిన పంటలు ఎండిపోతే చావే శరణ్యమని వాపోయారు. అనంతరం డీఈ పెంచలయ్యకు వినతి పత్రం ఇచ్చారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు


మేర్లపాక టోల్‌గేట్ వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఏర్పేడు(రేణిగుంట): రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఏర్పేడు మండలం మేర్లపాక సమీపంలో కొత్తగా ఏర్పాటైన టోల్‌ప్లాజా వద్ద రహదారి భద్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎంవీఐ దామోదర్‌నాయుడు, సీఐ జయచంద్ర పాల్గొన్నారు. టోల్‌గేట్ కార్యాలయంలో జాతీయ రహదారి–71లో సీసీ కెమెరాలను పరిశీలించి, తరచూ ప్రమాదాలు వాటిల్లుతున్న ప్రదేశాలను గుర్తించి, అక్కడ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

ఇంటర్వ్యూలకు 352 మంది హాజరు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 352 మంది హాజరయ్యారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సౌభాగ్యం ఆధ్వర్యంలో మండలంలోని పలువురు బ్యాంకర్లు దరఖాస్తుదారులకు రెండు రోజులుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఏర్పేడు యూనియన్ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకుల పరిధిలో మొత్తం 219 మంది దరఖాస్తు చేయగా, 170 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఆమె తెలిపారు. మొత్తం మండలంలో రెండు రోజులపాటు జరిగిన ఇంటర్వ్యూలకు 448 మందికి గాను 352మంది హాజరైనట్లు తెలిపారు.

నేడు యథావిధిగా విద్యుత్ సరఫరా

శ్రీకాళహస్తి: స్థానిక విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో రెండో శనివారం అయినా విద్యుత్ సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా యథావిధిగా జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో నెలసరి మరమ్మతు పనులను వాయిదా వేసినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తరువాత తేదీని ప్రకటిస్తామని చెప్పారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎన్ఆర్ఐ షేక్‌బాబు నూరుద్దీన్

వరదయ్యపాళెం: మండలంలోని సీఎల్ఎన్‌పల్లెకు చెందిన 30 మంది ముస్లిం మైనారిటీ కుటుంబాలకు ఎన్ఆర్ఐ షేక్‌బాబు నూరుద్దీన్ నిత్యావసర సరుకులు అందజేశారు. రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం సీఎల్ఎన్‌పల్లి మసీదు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం, కేజీ గోధుమ పిండి, కూరగాయలు వితరణ చేశారు. కార్యక్రమంలో మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ను కమ్మేసిన పొగ



రేణిగుంట రైల్వేస్టేషన్ సమీపంలోని పంచాయతీ డంపింగ్ యార్డ్‌లోని చెత్తను శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో కాల్చడంతో రైల్వేస్టేషన్ సమీప ప్రాంతాలన్నీ పొగతో నిండిపోయాయి. ప్రధానంగా రైల్వేస్టేషన్, బుగ్గవీధి, ఏఎస్ఆర్ కాలనీ, సీబీఐడీ కాలనీ ప్రాంతాల్లో పొగ కమ్ముకునేసింది. పొగ కారణంగా స్థానికులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

– రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్)





మహిళలకు చదువే ప్రధానం


వానెల్లూరులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, బెర్జిన్ పైప్స్ సిబ్బంది, విద్యార్థులు

సత్యవేడు: మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు చదువే అత్యంత ప్రధానమని శ్రీసిటీలోని బెర్జిన్ పైప్ సపోటార్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జితేంద్ర చోప్ర అన్నారు. శుక్రవారం వానెల్లూరు పంచాయతీలోని అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులతో కలసి కంపెనీ యాజమాన్య, సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలసి మహిళా దినోత్సవం పురస్కరించుకుని సర్పంచ్ ఆశాలత అధ్యక్షతన బాల్య వివాహాల నిర్మూలన, బాలికల చదువు, పిల్లల వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చోప్రతోపాటు సీడీపీఓ దేవకుమారి మాట్లాడారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ, మహిళలు మహిళా చట్టాలపై అవగాహన పొందాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న బాలామృతం వృథా చేయకూడదన్నారు. అంతకుమందు పంచాయతీలో విద్యార్థులు, కంపెనీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు కలసి బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కంపెనీ మేనేజర్ షేక్ ఆల్తాఫ్, సీనియర్ మేనేజర్, రాధిక, సీడీపీఓ, సర్పంచ్, ఎబినైజర్ తదితరులు అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. హెచ్ఎం హేమావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమ్మ, ఇందిర, మేనక, రాధిక, పార్వతి, అభిధామి, కోకిల, శశికళ, నవీన్ పాల్గొన్నారు.


నాగలాపురం: సన్మానం అందుకున్న ఉపాధ్యాయినులతో అధికారులు

అన్ని రంగాల్లో ముందుండాలి


ఏర్పేడు(రేణిగుంట): మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మమ్మ

ఏర్పేడు(రేణిగుంట): మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మమ్మ అన్నారు. ఏర్పేడు మండలం నాగంపల్లి సమీపంలోని ఎస్ఓఎస్ బాలల గ్రామంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఆమె మాట్లాడుతూ మహిళ విద్యతోపాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకున్నప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలు హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. డీసీసీబీ బ్రాంచి ఇన్‌చార్జ్ మేనేజర్ దీపారాణి, ఫీల్డ్ ఆఫీసర్ రమేష్, ఎఫ్ఎస్‌పీ లొకేషన్ ఇన్‌చార్జి సత్యనారాయణ, మునిరత్నం, జయలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నాగలాపురం: పిచ్చాటూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంఈఓ కె.హేమామాలిని అధ్యక్షతన మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ మహ్మద్ రఫీ హాజరయ్యారు. ఎంఈఓ మాట్లాడుతూ బాలికలు, మహిళలు, ఆరోగ్య సంరక్షణ కార్మికుల సంరక్షకులు ఆవిష్కర్తలుగా మారిన వైనాన్ని ఐక్యరాజ్య సమితి కూడా గుర్తించిందన్నారు. మహిళలపై అఘాయిత్యాలు, దాడులు, హింసకు అడ్డుకట్ట వేసే దిశగా సంఘటిత శక్తులై ప్రతిఘటించాలన్నారు. మహిళా సమానత్వమే అందరికీ హితమని అన్నారు. అనంతరం ఉపాధ్యాయినులను మహారాణులుగా పేర్కొంటూ శాలువలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల టీచర్లు పాల్గొన్నారు.

